# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 28-03-2026 సమయం : సాయంకాలం 6గం.10ని.లు

## ముఖ్యాంశాలు

- రాజధాని అమరావతి చట్టబద్ధతపై తీర్మానాన్ని రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించినట్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించారు.
- అమరావతి ప్రజా రాజధాని అని, దీనికి చట్టబద్ధత కల్పించడం ద్వారా భవిష్యత్‌లో ఎలాంటి సమస్యలు రావని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ఏపీ ఫైబర్ నెట్ ద్వారా మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.
- రాష్ట్రానికి ఒక్కటే రాజధాని ఉందని, అది అమరావతి మాత్రమేనని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 132వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.

====================

అమరావతి ప్రజా రాజధాని అని, దీనికి చట్టబద్ధత కల్పిస్తే.. భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బంది ఉండదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కోరుతూ తీర్మానం చేసేందుకు రాష్ట్ర శాసనసభ ఈరోజు ప్రత్యేకంగా సమావేశమైంది. సభ ప్రారంభం కాగానే.. తీర్మానాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టారు. శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. శాతవాహనులు అమరావతి నుంచే పాలించారని, బ్రిటిష్ మ్యూజియంలోనూ అమరావతి గ్యాలరీ ఉందని చెప్పారు. దేశంలోనే అమరావతి, హైదరాబాద్ రెండూ అగ్రస్థానంలో ఉండాలని పేర్కొన్నారు. విజయవాడ- గుంటూరుల మధ్య రాజధాని పెట్టాలని 46 శాతం మంది కోరుకున్నట్టు శివరామకృష్ణన్ కమిటీ స్పష్టంగా చెప్పిందన్నారు. అమరావతి రైతులు 58 రోజుల్లో 33 వేల ఎకరాల భూములు ఇచ్చారని, ఎలాంటి వివాదాలు లేకుండా భూసేకరణ చేశామని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్…30 సెకన్లు)

అనంతరం అమరావతి చట్టబద్ధతపై తీర్మానాన్ని అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. ఈ తీర్మానాన్ని ప్రభుత్వం కేంద్రానికి పంపనుంది. పార్లమెంట్ ఆమోదం పొందాక.. ఇది చట్టమవుతుంది.

====================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక్కటే రాజధాని ఉందని, అది అమరావతి మాత్రమేనని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కేంద్రాన్ని కోరే తీర్మానంపై చర్చ సందర్భంగా శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధికి రాజకీయ స్థిరత్వం చాలా ముఖ్యమని, అప్పుడే పెట్టుబడులు వస్తాయని తెలిపారు. రాష్ట్రం ఏర్పడి ఇన్నేళ్లయినా.. ఇప్పటికీ రాజధాని, సరైన హైకోర్టు లేకపోవడం సరికాదని ఉప ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్…30 సెకన్లు)

=====================

ఒకే రాష్ట్రం... ఒకే రాజధాని.. అభివృద్ధి వికేంద్రీకరణే ప్రభుత్వ విధానం అని రాష్ట్ర ఐ.టి శాఖా మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కేంద్రాన్ని కోరే తీర్మానంపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచమే ఆశ్చర్యపోయేలా రాజధాని నిర్మించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారని తెలిపారు. అమరావతి కోసం రైతులు, మహిళలూ పోరాడారని, వారి త్యాగం వెలకట్టలేనిదని పేర్కొన్నారు. అందరూ గర్వపడేలా రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకువస్తున్నామని, దానిలో భాగంగా ఉత్తరాంధ్రకు ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌ను తీసుకొచ్చామని తెలిపారు.

=====================

ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ 'జ్ఞానభూమి'కి ప్రతిష్ఠాత్మక స్కోచ్ ప్లాటినం అవార్డు లభించింది. ఢిల్లీలో ఈరోజు జరిగిన 106వ స్కోచ్ అవార్డుల కార్యక్రమంలో ఈ అవార్డును సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బి. లావణ్య వేణి అందుకున్నారు. జ్ఞానభూమి పోర్టల్ ద్వారా విద్యార్థులకు రియల్ టైం లో సేవలు అందించినందుకు గాను ఈ అవార్డు దక్కింది. జ్ఞానభూమి పోర్టల్ ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ప్రీ మెట్రిక్, పోస్టు మెట్రిక్ స్కాలర్ షిప్పులతో పాటు అంబేద్కర్ ఓవర్సీస్, విద్యోన్నతి, సివిల్స్ కోచింగ్ తో పాటు హాస్టళ్ల అడ్మిషన్లు వంటి సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులను ఆ శాఖా మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అభినందించారు.

=====================

విరామం

=====================

ప్రజలకు ఏపీ ఫైబర్ నెట్ ద్వారా మెరుగైన, విస్తృతమైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏపీ ఫైబర్ నెట్ లిమిటెడ్ పై మంత్రి అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈరోజు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఫైబర్ నెట్ సేవలు మెరుగుపరచడం, కేబుల్ ఆపరేటర్ ల సమస్యలపై ప్రధానంగా చర్చ జరిగింది. ఫైబర్ నెట్ ద్వారా మెరుగైన సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపైనా మంత్రి, అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఏపీ ఫైబర్ నెట్ ఎండి గీతాంజలి శర్మ తదితరులు పాల్గొన్నారు.

=====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 132వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" తెలుగు అనువాదం ప్రధానమంత్రి ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, తిరిగి రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది.

=====================

మార్కాపురం జిల్లా సమీపంలోని రాయవరం వద్ద ఈ నెల 26వ తేదీన జరిగిన బస్సు ప్రమాదంలో మృతి చెందిన వారి భౌతిక కాయాలను వారి బంధువులకు ఈరోజు మార్కాపురం ప్రభుత్వ వైద్యశాల వద్ద అధికారులు అప్పగించారు. బస్సు ప్రమాదంలో 14 మంది సజీవ దహనం కావడంతో మృత దేహాల గుర్తింపునకు మృతుల బంధువుల రక్త నమూనాలను సేకరించి డీఎన్ఏతో సరిపోల్చి మృతదేహాలను అప్పగించామని మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు తెలిపారు. మృతదేహాలను వారి స్వస్థలాలకు అంబులెన్స్, ఎస్కార్ట్ ద్వారా తరలించామని, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రకటించిన ఎక్స్ గ్రేషియాను మృతుల కటుంబాలకు త్వరలోనే అందజేస్తామన్నారు. క్షతగాత్రులు ఒంగోలు, మార్కాపురం ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని, వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని పేర్కొన్నారు.

=====================

స్వాతంత్ర్య ఉద్యమం తరువాత అతి పెద్ద ఉద్యమం అమరావతి రైతుల పోరాటమని హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. అసెంబ్లీలో అమరావతి చట్టబద్ధ తీర్మానంపై ఈరోజు మాట్లాడుతూ అమరావతి రైతులు 1631 రోజుల పాటు పోరాడారని తెలిపారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే ఇది అత్యంత సుదీర్ఘ కాలం జరిగిన పోరాటం అని వివరించారు. ఈ ఉద్యమంలో చంటి బిడ్డలను ఎత్తుకుని, గర్భిణిలు, వృద్ధ మహిళలు కూడా రోడ్డుపైకి వచ్చి పోరాడారని హోంమంత్రి గుర్తు

చేశారు. కోర్టు అనుమతితో పాదయాత్ర చేస్తున్నప్పటికీ పోలీసులు అడ్డుకుని ఇబ్బందులు పెట్టారని ఆరోపించారు. మహిళా రైతుల ఉద్యమాన్ని గుర్తు చేసుకుని ఈరోజు అసెంబ్లీలో అమరావతి తీర్మానానికి పూర్తి మద్దతు ఇస్తున్నట్లు హోంమంత్రి అనిత పేర్కొంటూ...

(వాయిస్...30 సెకన్లు)

====================

విభజన అనంతరం ఏర్పడిన సవాళ్లను ఎదుర్కొంటూ రాష్ట్ర అభివృద్ధి కోసం తీసుకున్న నిర్ణయాల్లో అమరావతి కీలకమని, ఇది అన్ని ప్రాంతాలకు సమాన అవకాశాలు కల్పించే కేంద్రంగా మారుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. అసెంబ్లీలో అమరావతి చట్టబద్ధ తీర్మానం సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అమరావతి ద్వారా రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నామని మంత్రి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో అమరావతికి చట్టబద్ధత కల్పించే తీర్మానం ఒక కీలక మలుపు అని, ఇది తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టే నిర్ణయం అని పేర్కొన్నారు. అన్ని ఆటంకాలను ఎదుర్కొంటూ అమరావతికి చట్టబద్ధత తీసుకువస్తున్నామని, ఇది కేవలం పరిపాలనా నిర్ణయం మాత్రమే కాకుండా తెలుగు జాతి గౌరవాన్ని ప్రపంచానికి చాటే చారిత్రాత్మక అడుగు అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

====================

గంగా పరివాహక పశ్చిమ బెంగాల్ నుండి దక్షిణ తమిళనాడు వరకు ఒక ద్రోణి.. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, అంతర కర్నాటక రాష్ట్రాల మీదుగా ఉపరితల ఆవర్తనము విస్తరించి ఉన్నదని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. ఆంధ్రప్రదేశ్, యానాంపై దిగువ ట్రోపో ఆవరణములో నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని వాతావరణం కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు పేర్కొన్నారు. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలలో ఈరోజు, రేపు, ఎల్లుండి తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందన్నారు. ఈదురు గాలులు గంటకు ౩౦ నుంచి 40 కిలోమీటర్లు వేగముతో వీస్తాయని తెలిపారు.

====================

====================